ప్రజాశక్తి
ఆదివారం 18 ఫిబ్రవరి 2024



ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి- పెదబయలు : స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో శనివారం వాలీబాల్ టోర్నమెంట్ ను నిర్వహించారు. ఈ వాలీబాల్ టోర్నమెంట్లో ఆరు జట్లు పాల్గొనగా రన్నర్‌గా మంగబంద, విన్నర్ గా అలమగూడెం జట్లు గెలుపొందాయి. గెలుపొందిన జట్లకు వాలీబాల్ కిట్లతో పాటు, టీ షర్టులు, ట్రోఫీలను సిఆర్పిఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ చర్యన్ రాజు చేతుల మీదుగా అందజేశారు. సిఆర్పిఎఫ్ 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ చర్యాన్ రాజు మాట్లాడుతూ.. సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వాలీబాల్ టోర్నమెంట్లు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గిరిజన క్రీడాకారుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోటీలు దోహద పడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై మనోజ్ కుమార్, పర్రెడ సర్పంచ్ రవిశంకర్, హెడ్ కానిస్టేబుల్ నాయుడు పాల్గొన్నారు.



ఆడుతున్న క్రీడాకారులు

నిర్బంధాలు..నోటీసులు ...

- చలో విజయవాడ భగ్నానికి అడ్డంకులు
- ఉద్యోగులను ఎక్కడికక్కడ అడ్డుకుంటున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: సిపిఎస్ ఉద్యోగులపై ప్రభుత్వం ముప్పేట దాడి చేస్తోంది. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ప్రతిపక్ష నేతగా జగన్ హామీ ఇచ్చారు. దీన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎస్ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ ఆందోళనలను ఉదతం చేస్తూ ఈనెల 18న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దీంతో ఎప్పటిలాగే పోలీసులు కేసులతో ఉద్యోగులను జగన్ ప్రభుత్వం భయపెడుతోంది. సిపిఎస్ ఉద్యోగులు చిన్న సమావేశం పెట్టుకోవాలన్న అనుమతి ఇవ్వకపోగా ఉద్యోగులందరికీ నోటీసులు ఇస్తూ పోలీస్ స్టేషన్లలో కూర్చోబెడుతోంది. ఒపిఎస్ సాధనకు ఉద్యోగ సంఘాల నాయకులు ఈనెల 18న ఓట్ ఫర్ ఒపిఎస్ నినాదంతో చలో విజయవాడకు పిలుపునిచ్చిన నేపథ్యంలో వారికి ముందస్తుగా పోలీసులు నోటీసులు ఇచ్చారు. విజయవాడకు వెళ్లకుండా నిర్బంధించేందుకు చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఒపిఎస్ సాధన సమితి నాయకులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు కొందరికి ముందస్తు నోటీసులు అందజేశారు. కొంతమంది ఉద్యోగ సంఘాల నాయకుల ఇళ్ల వద్ద కాపలా పెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నిరసన కార్యక్రమానికి హాజరు కావద్దని ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసులు హెచ్చరిక నోటీసులో పేర్కొన్నారు. ఎపిసిపిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.ఈశ్వరరావును ముందస్తుగా ఇంటి వద్దనే పోలీసులు అరెస్టు చేశారు. ట్రైబల్ వెల్ఫేర్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.నీలకంఠంకు పోలీసులు నోటీసు అందజేశారు.



ఈశ్వరరావును హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు,



నీలకంఠంకు నోటీసులు అందజేస్తున్న పోలీసు.

ఉపాధ్యాయులకు నోటీసులు

దుంబ్రిగుడ: సీపీఎస్, జీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు చేపట్టిన ఛలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా ప్రభుత్వం పోలీసుల ద్వారా ఉపాధ్యాయులకు నోటీసులను అందజేశారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో యూటీఎఫ్ నాయకులను శనివారం పోలీసులు పిలిపించి నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహేశ్వరరావు మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంటే నోటీసులు అందించి ఉద్యమాన్ని నీరుగార్చేందుకు పూనుకోవడం సరికాదన్నారు. ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదంతో ముందుకు వెళ్తామని ఆయన తెలిపారు.

సిహెచ్‌డబ్ల్యులపై ప్రభుత్వం వివక్ష

- చెల్లించని సమాన పనికి సమాన వేతనం
- ఆందోళనలు చేపడుతున్నా పట్టించుకోని వైనం
- ఏళ్లుగా పని చేస్తున్నా ఆశావర్కర్లుగా గుర్తింపు కరువు



దీక్ష చేపడుతున్న సిహెచ్‌డబ్ల్యులు (ఫైల్)

ప్రజాశక్తి పాడేరు : అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీ లోని సామాజిక ఆరోగ్య కార్యకర్త (కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు) (సి హెచ్ డబ్ల్యుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. పోరాటం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు.

పాడేరు డివిజన్లోని 11 మండలాల పరిధిలో ఉన్న 34 ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 687 మంది సిహెచ్‌డబ్ల్యులు పనిచేస్తున్నారు. వీరంతా 2017లో నియమితులయ్యారు. ఆశా వర్కర్లతో సమాన పని చేస్తూ గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ వీరిని ఆశా వర్కర్లుగా గుర్తించక పోవడంతో సమాన పనికి తగిన వేతనం పొందలేని దుస్థితిలో ఉన్నారు. ఆశా వర్కర్లకు ప్రభుత్వం నెలకు పదివేల వేతనం చెల్లిస్తోంది. కానీ సమాన పని చేస్తున్న సిహెచ్‌బ్ల్యులకు మాత్రం నెలకు 4 వేలు మాత్రమే వేతనం అందుతుంది. దీంతో గత కొన్నేళ్లుగా ఈ సిహెచ్ డబ్ల్యులు ఆందోళనలు చేస్తూ తమను ఆశా వర్కర్లుగా గుర్తించాలని, సమాన పనికి సమాన వేతనం రూ.10000 చెల్లించాలని ప్రభుత్వం దృష్టికి తెచ్చినా ఫలితం లేక పోయింది అనేకసార్లు అధికారులకు విన్నవించినా, స్పందన కరువైంది. దీంతో, గత మూడు రోజులుగా మరోసారి అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు ఐటిడిఏ ముందు సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. తాము సిహెచ్ డబ్ల్యులుగా చేరిన తరువాతే రెండుసార్లు ఏజెన్సీలో ప్రభుత్వం ఆశా వర్కర్ల నియామకాలు చేసిందని, సర్వీస్ తో పాటు అర్హతలు ఉన్న తమను మాత్రం ఆశా వర్కర్లుగా గుర్తించకుండా ప్రభుత్వం వివక్ష చూపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆశ వర్కర్లుగా మార్పు చేసి సమాన వేతనం చెల్లించాలని, యూనిఫామ్, మొబైల్ సెల్ ఫోన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆశాలుగా గుర్తించాలి

తమను ఇన్నేళ్లు పాటు ప్రభుత్వం ఆశా వర్కర్లుగా గుర్తించకపోవడం చాలా అన్యాయం. ప్రభుత్వం తీరుతో తామెంతో నష్టపోయాం. ప్రస్తుతం పని చేస్తున్న సిహెచ్‌డబ్ల్యులలో నర్సింగ్, స్టాఫ్ నర్స్, ఇంటర్, డిగ్రీ చదువుకున్న వారే అధికులు ఉన్నారు. అనుభవంతో పాటు అర్హతలు ఉన్న తమకు ఇన్నేళ్లు ఆశాలుగా గుర్తించకపోవడం, సమాన వేతనం ఇవ్వకపోవడం ప్రభుత్వానికి తగదు.ఆశా వర్కర్లుగా గుర్తించాలి



కిల్లో పద్మ,
జిల్లా కమిటీ సభ్యురాలు
సిహెచ్‌బ్ల్యుల సంఘం

ఏళ్ల తరబడి పోరాటం

సిహెచ్‌డబ్ల్యుల సమస్యల పరిష్కారం కోసం ఏళ్ల తరబడి పోరాడుతున్నాం. ప్రభుత్వం నుంచి తమకు ఇన్నేళ్లు ఎటువంటి పరిష్కారం చేయ లేదు. వేతనాలు కూడా ఐదేసి నెలలు బకాయిలతో సతమతమవుతున్నాం. సిహెచ్‌బ్ల్యులను తక్షణమే ఆశా వర్కర్లుగా గుర్తించి సమస్యలన్నీ ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతున్నాం. సమాన వేతనం ఇవ్వాలి, ఇతర సౌకర్యాలు కల్పించాలి.



కె.పార్వతి,
జిల్లా కమిటీ సభ్యురాలు,
సిహెచ్‌డబ్ల్యుల సంఘం



పూల వర్షంతో కలెక్టర్‌ను ఊరేగిస్తున్న అధికారులు

సుమిత్ కుమార్‌కు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-పాడేరు: విధి నిర్వహణలో నిజాయితీ పారదర్శకతలే ప్రధానమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ బదిలీ సందర్భంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ను ఘనంగా అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా సుమిత్ కుమార్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో పనిచేయడం అదృష్టంగా భావించి సేవలందించాలని చెప్పారు. గిరిజనులతో స్నేహపూర్వకంగా మాట్లాడి గిరిజన సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని సూచించారు. గిరిజనులను ఉన్నతంగా ఉండేలా కృషి చేయాలని చెప్పారు. పట్టణాలల్లో అన్ని రకాల సౌకర్యాలు ఉంటాయని ఉంటాయని ఎటువంటి సౌకర్యాలు లేని గిరిజన ప్రాంతాలలో పని చేసి మంచి సేవలు అందించాలన్నారు. జిల్లాలో పనిచేసిన అనుభవాలను ఎప్పటికి మరచిపోలేనన్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ భావోద్వేగానికి లోనయ్యారు. ఐటిడిఏ పిఒ వి.అభిషేక్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ స్ఫూర్తితో తీసుకుని ప్రజలకు సేవ చేయాలని తెలిపారు.

జాయింట్ కలెక్టర్ భావనా వశిష్ట మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రోత్సాహం మరవలేనని అన్నారు. అదే స్ఫూర్తితో సేవలందిస్తానని చెప్పారు. రంపచోడవరం, చింతూరు ఐటిడిఏ పి ఓలు, సూరజ్ గనోరే, చైతన్య, సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, చింతపల్లి ఎ ఎస్ పి కె. ప్రతాప్ శివ కిషోర్, పలువురు జిల్లా అధికారులు మాట్లాడారు ఈ సన్మాన సభలో డి.ఆర్.ఓ దక్షిణామూర్తి, ఎస్‌డి సిలు వివి ఎస్ శర్మ, పి.అంబేద్కర్, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఈఈ డి.వి.ఆర్.ఎం.రాజు, అధికారులు పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారులు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి తదితరులు

విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలి

- ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-విఆర్.పురం

విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యా బోధన చేయాలని ఎంపిపి కారం లక్ష్మి ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని పెద్దమట్టపల్లి మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంపిపి లక్ష్మితో పాటు సిపిఎం నాయకులు సందర్శించారు. విద్యార్థులకు భోజనం మెనూ ప్రకారం సక్రమంగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని చదువు సక్రమంగా చెప్పాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు పంకు సత్తిబాబు, వడ్లాది రమేష్, జి.లక్ష్మణరావు, సిరపు తాతబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలోనూ రైతు ఉత్పాదక సంఘం ఉండాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని ప్రతి గ్రామంలోనూ రైతు ఉత్పాదక సంఘం తప్పనిసరిగా ఉండాలని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం రైతు సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ వెంకటలక్ష్మి మాట్లాడుతూ, రైతు ఉత్పాదక సంఘం ద్వారా రైతు కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. రానున్న వేసవిలో జీడిమామిడి రైతులు నష్టపోకుండా ఉండేందుకు సంఘటితంగా జీడి పిక్కలు విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం ఆదినారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి గోము వెంకటలక్ష్మి

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించండి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని ఏడుగురాళ్లపల్లి పంచాయతీ పరిధి లంకపల్లి, పావురలంక తదితర గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని సిపిఎం రంపచోడవరం జిల్లా కమిటీ సభ్యులు పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. వెంకట్ ఆధ్వర్యంలో సిపిఎం బృందం శనివారం లంకపల్లి, పావురలంక గ్రామాలను సందర్శించి, ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని పాఠశాలకు భవనం, ప్రహరీ నిర్మాణం చేస్తామని గత ఎన్నికల్లో వైసిపి నాయకులు చెప్పి ఓట్లు వేయించుకొని, తీరా గెలిచాక ఐదేళ్లయినా నేటికీ ఆ సమస్యలను పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. అనంతరం సిపిఎం నేత వెంకట్ మాట్లాడుతూ ఎన్నికల్లో హామీలిచ్చి ఓట్లు వేయించుకున్న అధికార వైసిపి ప్రజాప్రతినిధులు, సమస్యల పరిస్కారం కోసం చిత్తశుద్ధిగా ఎందుకు కృషి చేయడం లేదని ప్రశ్నించారు. ఐదేళ్ల క్రితానికి, నేటికీ గ్రామాలలో ఏమి మార్పు వచ్చిందో తెలపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం ఉమ్మడిగా వున్నప్పుడు సిపిఎం ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు చేసిన అభివృద్ధి తప్ప రాష్ట్రం విడిపోయిన తర్వాత టీడీపీ కాని, వైసీపీ గాని కొత్తగా ఏమి అభివృద్ధి చేయలేదని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతం అభివృద్ధి పట్ల ఆ పార్టీలకు చిత్తశుద్ధి లేదన్నారు. గిరిజన చట్టాలు, హక్కులను హరిస్తున్న బీజేపీకి మద్దతు ఇస్తున్న వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లంకపల్లి పావురలంక గ్రామాలలో పాఠశాల, అంగన్వాడీ భవనాలు నిర్మించాలని, రోడ్డు వేయాలని, విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మల్లం సుబ్బమ్మ, సవలం కన్నయ్య, సవలం దేశయ్య గ్రామస్తులు ఎర్రయ్య, సాయి, రాజు, కోసయ్య తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వెంకట్

సిపిఎస్ రద్దు చేయాలని ర్యాలీ

తహశీల్దారుకు వినతి

ప్రజాశక్తి- అడ్డతీగల

సిపిఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ జెఎసి ఆధ్వర్యాన శనివారం ర్యాలీ నిర్వహించి, తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సిపిఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరిస్తామని వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలోనూ, గత ఎన్నికల సమయంలోనూ హామీ ఇచ్చారని, నేటికీ ఆ హామీని అమలు చేయలేదని పేర్కొన్నారు. తక్షణమే సిపిఎస్ రద్దు చేసి, ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్లో ఉన్న డిఎ, ఎరియర్, ఇతర ఆర్థిక బకాయిలు చెల్లించాలని, ప్రతి నెలా 1వ తేదీన జీతాలు ఇవ్వాలని, 12వ పిఆర్‌సి విధి విధానాలను వెంటనే ప్రకటించాలని, పిఆర్‌సి ఇచ్చే వరకు ఐఆర్ ఇవ్వాలని, డిఎస్‌సి నోటిఫికేషన్‌లో పొందిపర్చిన అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి తేజోరావు, జిల్లా ఆడిట్ మెంబర్ మంగరాజు, జిల్లా కౌన్సిలర్ నాగప్రసాద్, మండల అధ్యక్షుడు శ్రీను, ప్రధాన కార్యదర్శి కెవి.రాఘవులు, నాయకులు రమణమ్మ, కమల రత్నం, దొరబాబు, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు రమణ, అధిక సంఖ్యలోఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

నాటుసారా తయారీదారుడు అరెస్టు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని లాగర గ్రామ శివారులో నాటు సారా బట్టీపై రాజవొమ్మంగి పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. సారా తయారీకి ఉపయోగించే 150 లీటర్ల బెల్లం ఊటను, పాత్రలను ధ్వంసం చేశారు. నాటు సారా బట్టీ నిర్వాహకుడు పి శ్రీనును అరెస్ట్ చేసి అడ్డతీగల కోర్టుకు తరలించారు. నిందితునికి మెజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు అదనపు ఎస్సై జాన్‌బాబు తెలిపారు.

ఐఎన్‌టియుసి కార్యాలయంలో గంజాయి ?

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎపి జెన్కో ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టియుసి) (327 నెంబర్) కార్యాలయంలో గంజాయి పట్టుబడినట్లు తెలిసింది. ఐఎన్‌టియుసి యూనియన్ కార్యాలయం 327 నెంబరులో గంజాయి ఉందన్న సమాచారంతో మోతుగూడెం పోలీసులు ఆ కార్యాలయాన్ని తెరిపించి గంజాయిని స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. కార్యాలయం తాళాలు ఉద్యోగస్తుల వద్ద ఉండటంతో వారిని స్టేషన్‌కు పిలిపించి విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఐఎన్‌టియుసి యూనియన్‌కు చెందిన వారే ఈ స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారంటూ ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో కూడా గంజాయి విషయంలో మోతుగూడెం పోలీస్ స్టేషన్ వార్తల్లోకెక్కింది. భారీగా గంజాయి రవాణా జరుగుతుంది. గతంలో గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఒక కంటైనర్‌కు సంబంధించిన వారే మళ్లీ గంజాయి రవాణాకు పాల్పడినట్లు సమాచారం.

టిడిపి గెలుపునకు కృషి చేయాలి

మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి

ప్రజాశక్తి-విఆర్.పురం

తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు సైనికుల్లా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో టిడిపి మండల కార్యకర్తల సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షులు ఆచంట శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఇందులో పాల్గొన్న రాజేశ్వరి మాట్లాడుతూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బాబు షూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ, కుటుంబ సాధికారత కమిటీ, ఓటర్ వెరిఫికేషన్ వంటి కార్యక్రమాలు త్వరగా చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎన్నికలకు సిద్ధం అని చెబుతున్నారని, ఏమి చేశారని ఆయన సిద్ధంగా ఉన్నారని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు లక్షా 15 వేల రూపాయలు ఇచ్చిన వాటికి తాము అధికారంలోకి వస్తే రూ.5 లక్షలు ఇస్తామని చెప్పి మాట తప్పినందుకా? ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.10 లక్షలు ఇస్తానని చెప్పి ఇవ్వకుండా నిర్వాసితులను మోసం చేసినందుకా? టిడిపి హయాంలో నిర్వాసితుల కోసం నిర్మించిన కాలనీలను నేటి వరకు వారికి ఇవ్వనందుకా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామారావు, టిడిపి నాయకులు బురక కన్నారావు, పుట్టి రమేష్, ఆకోజు భాగ్యలక్ష్మి, ముత్యాల సిద్దు, నగేష్, చందు, బీరక సూర్య ప్రకాష్‌రావు, అచ్చిరాజు, పెందుర్తి సుదర్శన్‌రావు, బురక సారయ్య, కారం సిరమయ్య, ముత్యాల చంద్రశేఖర్, రేవు సింహాచలం, వెంకమ్మ, పోడియం సావిత్రి, పులి సాహెబ్, ముత్యాల శంకర్‌రావు, బోధిబోయిన సురేష్‌రావు, కుంజం బాపన్నదొర పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరి, టిడిపి నాయకులు



యూనిట్లను పంపిణీ చేస్తున్న పిఒ

సోలార్ ఇరిగేషన్ యూనిట్లతో అధిక దిగుబడులు

- ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి -పాడేరు : సోలార్ ఇరిగేషన్ యూనిట్లు వినియోగించి అధిక వ్యవసాయ దిగుబడులు సాధించాలని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ సూచించారు. అందుబాటులో ఉన్న జల వనరులను వినియోగించుకుని ఏడాదికి రెండు పంటలు పండించాలని సూచించారు. సిసిడిపి నిధులతో గిరిజన రైతులకు ఐటిడిఏ కార్యాలయం వద్ద శనివారం కొయ్యూరు మండలానికి చెందిన ఆరుగురుకి ఉచితంగా సోలార్ ఇరిగేషన్ యూనిట్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.15 లక్షల విలువైన సాగునీటి యంత్రాలను గిరిజన రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, వీటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. 110 యూనిట్లు గిరిజన రైతులకు పంపిణీ చేయడానికి లక్ష్యంగా నిర్దేశించుకుని ఇప్పటి వరకు 103 యూనిట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. వ్యవసాయ దిగుబడులు సాధించడానికి గిరిజన రైతులకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి వి.ఎస్. ప్రభాకరరావు, ప్రాజెక్టు వ్యవసాయాధికారి కె.ఝాన్సీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎపిజివిబి భవనం ప్రారంభం

ప్రజాశక్తి- పెదబయలు :మండల కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ నూతన భవనాన్ని అనకాపల్లి రీజనల్ మేనేజర్ చిరంజీవి వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో కూడా విస్తతమైన సేవలందిస్తున్న ఏకైక బ్యాంక్ ఆంధ్రప్రధేవ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ అని తెలిపారు. అనకాపల్లి రీజనల్ లో పెదబయలు బ్యాంక్ 55 వేల కోట్లతో బిజినెస్ కొనసాగుతుందని తెలిపారు.1993 నుండి ప్రారంభించగా కొత్త భవనాన్ని నిర్మించామన్నారు.ఈ కార్యక్రమంలో డివిజనల్ బ్యాంక్ మేనేజర్ నాగరాజు, పెదబయలు మేనేజర్ కర్రీ కృష్ణ, ఏపీఎం చంద్రకళ, బ్యాంక్ మిత్రులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి:ప్రజలు తెలియజేసిన ప్రతి సమస్యకూ పరిష్కారం చూపామని పాడేరు శాసనసభ్యులు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. చింతపల్లి ఎస్సీ కాలనీలో శనివారం సీసీ రోడ్డు, డ్రైనేజీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రూపాయి అవినీతి లేని సంక్షేమ పాలనను వైసిపి ప్రభుత్వం అందించిందన్నారు.ఎస్సీ కాలనీలో డ్రైనేజ్ నిర్మాణం కానీ సిసి రోడ్ల నిర్మాణం, ఇతర సౌకర్యాల ఏర్పాటు కోసం సర్పంచ్ చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు దురియ పుష్పలత, ఎంపిటిసిలు జయలక్ష్మి, పద్మ, జడ్పిటిసి పోతురాజు బాలయ్య పడాల్, ఎంపీపీ కోరాబు అనూషదేవి మండల అధ్యక్షులు మోరి రవి పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాపై అవగాహన

ప్రజాశక్తి- ఆనందపురం : వృత్తి విద్య శిక్షణలో భాగంగా ఆనందపురం జిల్లా పరిషత్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులకు విద్యుత్ వినియోగంపై విద్యుత్ సబ్ స్టేషన్ ఎఇ సురేష్‌కుమార్ శనివారం అవగాహన కల్పించారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్లో వృత్తి విద్య ఉపాధ్యాయుడు భీష్మ నారాయణ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎఇ సురేష్‌కుమార్ మాట్లాడుతూ, విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ ఎలా సరఫరా అవుతుంది, విద్యుత్తును ఎలా వినియోగించుకోవాలనే విషయాలపై వివరించారు. నేడు అన్ని రంగాలకు విద్యుత్ చాలా అవసరమని, దాన్ని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు భాస్కరరావు, శ్రీనివాసరావు, ఆపరేటర్ సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

డిఎస్‌సి పోస్టుల భర్తీలో..

గిరిజన నిరుద్యోగులకు అన్యాయం



మాట్లాడుతున్న గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: గిరిజనులకు వంద శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని గిరిజన సలహా మండలి (టీఏసి) లో చేసిన తీర్మానానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం జనరల్ డిఎస్సి నోటిఫికేషన్ జారీ చేయడం గిరిజన వ్యతిరేక విధానమని ఆదివాసీ గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యులు పి అప్పలనర్స మండిపడ్డారు. పాడేరు ఆదివాసీ గిరిజన సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జీవో 3 రిజర్వేషన్లు సుప్రీంకోర్టు రద్దు చేసిందని, గిరిజనుల పోరాట ఫలితంగా గిరిజన సలహా మండలి లో ఎమ్మెల్యేలు తీర్మానం చేశారని, దీని ప్రకారం ఆదివాసులకు 100శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలన్నారు. మరో పక్క సుప్రీంకోర్టు తీర్పును పున:పరిశీలన చేయాలని పిటిషన్ దాఖలై విచారణ దశలో ఉంటే వాటికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీలకు వ్యతిరేకంగా పూనుకోవడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జనరల్ డిఎస్సిలో 6100 పోస్టులలో ఎస్టీలకు సంబంధించిన సుమారు 1023 పోస్టులను భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. వీటిలో ఏజెన్సీ ప్రాంతాల్లో సుమారు 500 పోస్టులు భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్‌లో పేర్కొన్నా ఆదివాసులకు మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 40 పోస్టులు మాత్రమే ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసులకు రోస్టర్ పాయింట్లు ప్రకారం కేటాయించారని చెప్పారు.జనరల్ డిఎస్సీ నిబంధన ప్రకారం ఉపాధ్యాయ పోస్టులు రిక్రూట్మెంట్ అయితే ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక ఆదివాసులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. గిరిజన గురుకులం సొసైటీ నిబంధన ప్రకారం ఖాళీ పోస్టులను సొసైటీ నోటిఫికేషన్ ద్వారా మాత్రమే భర్తీ చేయాలన్నారు. సొసైటీ నిబంధనలను దిక్కరించి జనరల్ డిఎస్సీ లో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఖాళీగా ఉన్న 1800 పోస్టులకు గను 600 పోస్టులను జనరల్ డిఎస్సిలో కలిపి భర్తీకి నోటిఫికేషన్ జారీ చేయడం గిరిజన సంక్షేమ గురుకుల నిబంధనలు ఉల్లంఘించడమేనన్నారు. గిరిజన గురుకులల్లో రోస్టర్ పాయింట్ల పేరుతో ఆదివాసీ నిరుద్యోగులను స్కూల్ నుంచి గెంటి వేయడానికి కుట్ర చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతంలో 2శాతం ఉన్న గిరిజనేతరులకు 94 శాతం పోస్టులు కేటాయించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఆదివాసులకు రాజ్యాంగ నిబంధనల ప్రకారం సంక్రమించిన అధికారాలను, రాయితీలను నీరుగార్చడం సరికాదని. రాష్ట్ర ప్రభుత్వం చర్యను అధికార ప్రతిపక్షాల ప్రజా సంఘాలు ఖండించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ ఎమ్మెల్యేలు, ఎంపిల ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందన్నారు. వీటిపై ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోతే న్యాయపోరాటం చేస్తామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఎస్.ఎఫ్. ఐ జిల్లా అధ్యక్షుడు కొర్ర కార్తిక్, జిల్లా కార్యదర్శి కొర్ర జీవన్ కుమార్, జిల్లా నాయకులు సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

రైతులకు సాగు నీరు అందించాలి

సిపిఎం నేతల డిమాండ్

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:మండలంలోని పెదలబుడు మేజర్ పంచాయతీ శరభగుడ, కంటభౌంసుగుడ, తాంగులగుడ, నిసానిగుడ గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న పొలాలకు విద్యుత్ సమస్య కారణంగా సాగు నీరు అందలేదని సిపిఎం నాయకులు తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు. కె.జగన్నాధం, హరి రైతులు కలిసి ఎండిపోతున్న పొలాలను పరిశీలించారు. అనంతరం సబ్ స్టేషన్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కె.రామారావు మాట్లాడుతూ, లిఫ్ట్ ఇరిగేషన్ పై ఆధారపడి సుమారు 100 కుటుంబాలు 500 ఎకరాలలో సాగు చేస్తున్నారని, తక్షణమే సాగు నీరు అందించాలన్నారు. ప్రస్తుతం రైతులు అనేకమంది వేసవి రెండో పంట కోసం సిద్ధమయ్యారని, నీరు సరఫరా లేకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పని చేయక పోవడంతో పొలాలకు నీరు అందలేదన్నారు. విద్యుత్ సమస్య పరిష్కారం చేయాలని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా వ్యవసాయం చేస్తున్న గిరిజన రైతులకు విద్యుత్ సౌకర్యం కల్పించి నీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.తక్షణమే అధికారులు స్పందించి రైతులు పొలాలకు నీరు సరఫరా చేసి ఆదుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రెసిడెంట్ తాంగుల హరి, వైస్ ప్రెసిడెంట్ బి.కోగేశ్వరావు, కార్యదర్శి కిలో జగనాదం, లింగ ,కె.రాము, చినడొంబు, గోవర్ధన్, జిన్ను, ముకుంధ్, సహదేవ్ పాల్గొన్నారు.



ఎండిపోతున్న పొలాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు, రైతులు



మాట్లాడుతున్న ఎంపిపి నీలవేణి

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలో సమస్యలు పరిష్కరించడంలో మండల స్థాయి అధికారులు నిర్లక్ష్యం చేయ వద్దని ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పిటిసి దీసరి గంగరాజు సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో తాగునీటి, విద్య, వైద్యం, విద్యుత్ తదితర సమస్యలపై సభ్యులు సర్పంచ్ కె.మొస్యచ ఎంపిటిసిలు తమ గళం విప్పారు.కొన్ని గ్రామాలకు తాగునీటి సమస్య ఉందని, మారుమూల పాఠశాలలకు ఉపాధ్యాయులు విధులకు హాజరు కాకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని తెలిపారు.ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహల్లో ప్రైవేటు వ్యక్తి ఏర్పాటు చేసిన జిప్ లైన్‌ను ఐటీడీఏ స్వాధీనం పరుచుకోవాలని డిమాండ్ చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఎటువంటి అంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎంపీటీసీలు, సర్పంచులు చూడవలసిన బాధ్యత ఎంతైనా ఉందని ఎస్ఐ రాము పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ డి, జయవర్ధని, కో ఆప్షన్ సభ్యులు షేక్. మదీనా, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ఎంపీడీవో హర్షిత్ రాజ్యం, సిడిపిఓ సంతోషకుమారి, వైద్య అధికారిణీ జ్ఞానేశ్వరి, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు

ఎయుతో సంయుక్త ప్రాజెక్టులు నిర్వహించండి

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయంతో సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టులను నిర్వహించాలని అమెరికాకు చెందిన ఈటాన్ రీసర్చ్ ల్యాబ్ సీనియర్ ప్రిన్సిపల్ ఇంజినీర్ డాక్టర్ విజయ్ భావరాజును ఎయు వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి ఆహ్వానించారు. శనివారం ఆంధ్రవిశ్వవిద్యాలయాన్ని సందర్శించిన విజయ్‌భావరాజు ప్రసాదరెడ్డితో భేటీ అయ్యారు. క్రిటికల్ టెక్నాలజీస్, ఎయు నిర్వహిస్తున్న స్టార్టప్స్‌కు తాను అడ్వైజర్‌గా సేవలు అందిస్తానని సుముఖత వక్తం చేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ, పరిశోధనల్లో సంయుక్త భాగస్వామ్యంతో పనిచేయాలని ఆహ్వానించారు. వర్సిటీ తరపున డాక్టర్ విజయ్ భావరాజును సత్కరించారు. అనంతరం ఎలక్ట్రిక్ ఇంజినీరింగ్ విభాగంలో విద్యార్థులనుద్దేశించి 'చాలెంజెస్ ఇన్ మోడరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ ఇన్ ద ఎమర్జింగ్ క్లైమేట్ ఇష్యూస్' అంశంపై ప్రసంగించారు. విభాగ ఆచార్యులతో పరిశోధన రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణలపై చర్చించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య పి.మల్లికార్జునరావు, బిఒఎస్ ఛైర్‌పర్సన్ ఆచార్య కె.రమాసుధ పాల్గొన్నారు.

గీతంలో విదేశీ విద్యార్థుల సందడి

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో వివిధ కోర్సుల అభ్యసిస్తున్న వివిధ దేశాలకు చెందిన విద్యార్థుల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న అంతర్జాతీయ విద్యార్థుల యువజనోత్సవం "సంయుక్త- 24"లో శనివారం వివిధ విద్యా సంస్థల నుంచి హజరైన విదేశీ విద్యార్థులు సందడి చేశారు. నేపాల్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్ తదితర దేశాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన సంగీత, నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు తమ దేశాల సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేషధారణ తో ఇచ్చిన ప్రదర్శనలు అబ్బురపరిచాయి. అంతకు ముందు గీతం హాస్పిటాలిటి విభాగం ఆధ్వర్యాన విదేశీ విద్యార్థుల కోసం నిర్వహించిన వివిధ దేశాల వంటకాల ఫుడ్ ఫెస్టివల్ విద్యార్థులను ఆకర్షించింది. ఈ కార్యక్రమానికి ఉగాండ దేశపు విద్యా క్రీడల మంత్రిత్వ శాఖ సహయ కమిషనర్ డాక్టర్ టి.బైగానఎడ్డి ముఖ్యఅతిథిగా హజరై విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గీతం అంతర్జాతీయ విద్యార్థి వ్యవహరాల విభాగం డైరక్టర్ డాక్టర్ కెపి.కిషన్, స్టూడెంట్ లైఫ్ డైరక్టర్ బాలాకుమార్ పాల్గొన్నారు.



విన్యాసాలను ఆసక్తిగా తిలకిస్తున్న విశాఖ నగర వాసులు

మిలాన్ విన్యాసాలు షురూ..

- సాగర తీరంలో రిహార్సల్స్ అదుర్స్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 19 నుంచి 27 వరకు విశాఖపట్నంలో జరగనున్న మిలాన్ - 2024 విన్యాసాల రిహార్సల్స్ శనివారం సాయంత్రం బీచ్ రోడ్డులో ప్రారంభమయ్యాయి. ఆకాశంలో మిగ్‌లు దూసుకుపోయాయి. ప్యారాచూట్‌లతో నావికులు చేసిన విన్యాసాలు ఔరా అనిపించాయి. హెలీకాప్టర్ల విన్యాసాలు ఒళ్లు గగుర్పాటుకు గురిచేశాయి. నేవీ బ్యాండ్ వినసొంపుగా సాగింది. బీచ్ రోడ్డులో నావికులు కవాతు రిహార్సల్స్ చేపట్టారు. విన్యాసాల సన్నద్ధ కార్యక్రమాలను వీక్షించి పలువురు ఆనందం వ్యక్తం చేశారు. మిలాన్ - 2024 విన్యాసాలకు 50కి పైగా దేశాలు తమ ప్రతినిధులను పంపనున్న నేపథ్యంలో ఇప్పటికే తూర్పు నౌకాదళం అన్ని ఏర్పాట్లూ చేసింది. భారత నౌకాదళం నుంచి విమాన వాహక నౌకలు విక్రాంత్, విక్రమాదిత్య సహా దాదాపు 20 నౌకలు, మిగ్ 29కె, పి8ఐ సహా దాదాపు 50 విమానాలు విన్యాసాల్లో పాల్గొననున్నట్టు తెలుస్తోంది.

ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..

మిలాన్-2024 సందర్భంగా ఈ నెల 17, 18, 19 తేదీలలో ప్రాక్టీస్ పరేడ్ రిహార్సల్స్ దృష్ట్యా బీచ్ రోడ్డు నందు పార్క్ హోటల్ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు పబ్లిక్ వాహనాల రాకపోకలను మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు బీచ్ రోడ్డువైపుగల రెండు లైన్లలో పాక్షికంగా నిలిపివేశారు. బీచ్ రోడ్డు నందు ఎటువంటి వాహనాలకూ పార్కింగ్ అనుమతి లేదని డిసిపి-1 మణికంఠ చందోలు తెలిపారు. శనివారం సాయంత్రం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 20వ తేదీన జరిగే ఫుల్ డ్రెస్ రిహార్సల్స్, 22న జరిగే సిటీ పెరేడ్‌కు మరిన్ని ఆంక్షలు ఉంటాయని తెలిపారు. మిలాన్-2024కు పోలీస్ శాఖ 5000 మందితో భారీ భద్రత కల్పిస్తోందని వెల్లడించారు. ట్రాఫిక్ నిబంధనల నేపథ్యంలో నగర ప్రజలు, వాహనదారులు, పర్యాటకులు ప్రత్యామ్నాయ మార్గాలలో ప్రయాణించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

బిఎల్‌ఒలు నిబద్ధతతో పనిచేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఓటర్ల నమోదు ప్రక్రియలో నిజాయితీ, నిబద్ధతతో పనిచేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ బిఎల్‌ఒలు, సూపర్ వైజర్లను ఆదేశించారు. ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితా 2024లో భాగంగా గత నెల 22న తుది జాబితా ప్రచురణ అయిందని తెలిపారు. ఆ జాబితా తదుపరి నమోదు అవుతున్న ఫారం - 6, 7, 8లను బిఎల్‌ఒలు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అన్నారు. శనివారం ఉదయం ఉడా చిల్డ్రన్స్ ఎరీనాలో బిఎల్‌ఒల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా బిఎల్‌ఒలు, సూపర్ వైజర్లు పనిచేయాలని చెప్పారు. డెత్ కేసులు, డూప్లికేట్ ఓటర్లు వంటివి ఉన్నట్లయితే అటువంటి గృహాలను స్వయంగా సందర్శించి, కచ్చితమైన సమాచారంతో వాటిని పరిష్కరించాలని తేల్చిచెప్పారు. ఇందులో ఎటువంటి పొరపాట్లకూ తావులేకుండా, ఒత్తిడిలకు గురికాకుండా పారదర్శకంగా పనిచేయాలని స్పష్టం చేశారు. తప్పులు దొర్లితే సంబంధిత బిఎల్‌ఒలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి - పాయకరావుపేట : మండలంలోని పెదరామభద్రపురం గ్రామంలో దిగుమర్తి ఫౌండేషన్ ఆధ్వర్యాన కేన్సర్‌పై అవగాహన కల్పించారు. హెచ్‌పివి నియంత్రణకు టీకాలు వేశారు. మహిళలకు స్క్రీనింగ్ నిర్వహించారు. మానవసేవ సంస్థ సహకారం అందించిన ఈ శిబిరాన్ని పెద్ద సంఖ్యలో ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. డాక్టర్ రఘునాథరావు, డాక్టర్ లీలల పర్యవేక్షణలో డాక్టర్ పుట్టా శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ శరత్, డాక్టర్ ప్రియాంక సేవలు అందించారు.

రాష్ట్రంలో అరాచక పాలన

శంఖారావం సభల్లో నారా లోకేష్

పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరిస్తామని హామీ

తాడిని తరలిస్తామని ఉద్ఘాటన

ప్రజాశక్తి - భీమునిపట్నం, వేపగుంట

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అరాచక పాలనకు త్వరలో ప్రజలు చరమ గీతం పాడనున్నారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. విశాఖ జిల్లాలోని వేపగుంట, తగరపువలస సమీపంలోని చిట్టివలస బంతాట మైదానం వద్ద శనివారం జరిగిన శంఖారావం సభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచగ్రామాల భూ సమస్యను తాము అధికారంలోకి వస్తే పరిష్కరిస్తామన్నారు. తాడి గ్రామం తరలింపు, వేపగుంట రైతుల వుడా భూ సమస్య, సబ్బవరం-షీలానగర్ ఆరు లైన్ల రహదారి హామీలను నెరవేరుస్తామని చెప్పారు. ప్రజల్లో ఉండేవారే నిజమైన నాయకులని అన్నారు. హుదూద్ విలయానికి చివురుటాకులా వణికిన విశాఖను వారం రోజుల వ్యవధిలోనే సాధారణ స్థితికి తీసుకొచ్చిన ఏకైక ప్రజా నాయకుడు చంద్రబాబు అని చెప్పుకొచ్చారు. విశాఖ అంటే ఆయనకు ఎంతో అభిమానమన్నారు. 2019లో విశాఖ ఓటర్లు టిడిపికి బ్రహ్మరథం పట్టారని, ఆ అభిమానాన్ని ఎప్పటికీ మర్చిపోలేమని అన్నారు. రెండు నెలల్లో రాష్ట్రంలో టిడిపి, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడబోతుందని అన్నారు. విశాఖను ఆర్థిక రాజధానిగా మరింతగా అభివృద్ధి చేస్తామని, మెడికల్ డివైజ్ మ్యానిఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తాము చెప్పిన ఆరు పథకాలను అమలు చేస్తామని ఉద్ఘాటించారు. ఆయా సభల్లో టిడిపి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు ఎం.శ్రీభరత్, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త కోరాడ రాజబాబు, మాజీ ఎమ్మెల్యే, జనసేన నాయకులు పంచకర్ల రమేష్ బాబు, పంచకర్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా పార్టీ బూత్, యూనిట్, క్లస్టర్ ఇంఛార్జిలతో సమావేశమైన లోకేష్ 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ' ప్రచారం ఎలా జరిగిందన్న విషయంపై చర్చించారు. అనంతరం ఆరు పథకాల అమలుకు సంబంధించిన కిట్లు అందజేశారు. పద్మనాభం మాజీ ఎంపిపి కాళ్ల నగేష్ తదితరులు లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు.



చిట్టివలస సభలో మాట్లాడుతున్న లోకేష్

పని ప్రదేశాల్లో మహిళల హక్కులను పరిరక్షించాలి

జిల్లా అధికారులకు సూచించిన మెట్రోపాలిటిన్ సెషన్స్ జడ్జి శ్రీదేవి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పని చేసే ప్రదేశాల్లో మహిళల హక్కులను పరిరక్షించాలని, సురక్షితమైన వాతావరణంలో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులకు విశాఖపట్నం మెట్రోపాలిటిన్ సెషన్స్ జడ్జి ఎస్.శ్రీదేవి సూచించారు. మహిళల హక్కులకు ఎట్టి పరిస్థితుల్లోనూ భంగం కలిగించేలా ఎవరూ వ్యవహరించరాదని హితవు పలికారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం - 2013పై స్థానిక జిల్లా కోర్టు నూతన భవన సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక అవగాహన సదస్సు జరిగింది. జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు తదితరులు భాగస్వాములయ్యారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ చట్టం తాలూకా ఉద్దేశాలను, మహిళలకు కల్పించిన రక్షణ చర్యలను వివరించారు. చట్టం గురించి అధికారులందరూ క్షుణ్ణంగా తెలుసుకోవాలని, పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. ఆయా కార్యాలయాల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించి మహిళలపై వేధింపుల నిరోధక చట్టం గురించి విస్తృత అవగాహన కల్పించాలని చెప్పారు. సదస్సులో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వివేక ఆనంద శ్రీనివాస్, క్రైం డిసిపి పి.వెంకటరత్నం, బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్.రాంబాబు, విశాఖపట్టణం జిల్లా కోర్టు అదనపు న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జిలు, పలువురు మెజిస్ట్రేట్లు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధికారులు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, న్యాయవాదులు, కోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చకుంటే ఉద్యమం ఉధృతం

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జెఏసి హెచ్చరిక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ నెలాఖరులోగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక జెఏసి చైర్మన్ కె.ఈశ్వరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జెఏసి ఆధ్వర్యంలో శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎన్‌జిఒ హోమ్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పిఆర్‌సి అమలు చేసి, డిఎ బకాయిలు చెల్లించాలన్నారు. పిఆర్‌సి ఇస్తామని చెప్పిన మంత్రుల హామీ నేటికీ నెరవేరలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ధర్నాలో ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆర్.రవిశంకర్, ఎపిటిఎఫ్ నాయకులు కె.శ్రీనివాసు, యుటిఎఫ్ నాయకులు డి.నాగభూషణరావు, పెన్షనర్స్ సంఘం నాయకులు డి.ప్రసాదరావు, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.సత్తిబాబు, జ్యోతి, అధిక సంఖ్యలో ఉద్యోగస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు

ఏజెన్సీలో అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితం

ప్రజాశక్తి మారేడుమిల్లి : ఏజెన్సీలో అభివృద్ధి ఎక్కడ కానరావడం లేదని, రంపచోడవరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చెబుతున్న అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితమని మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు అభివృద్ధిని మరచి ఎన్నికలు సమీపిస్తున్న వేళ శంకుస్థాపనలు చేసి అమాయక గిరిజనులను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. వెలగపల్లి నుండి రామన్నపాలెం మధ్య సీతపల్లి వాగుపై బ్రిడ్జికి 2019లోనే ఎమ్మెల్యే ఎమ్మెల్సీలు శంకుస్థాపన చేశారని, నేటికీ దాని నిర్మాణం జరగలేదని, దానిని వారు పట్టించుకోలేదని ఆరోపించారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారని, గ్రామ పంచాయతీలకు 14, 15 ఆర్థిక సంఘాల నిధులు రూ.8వేల కోట్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు మాగాపు బాబురావు, గోళ్ళ చంటిబాబు, మాజీ ఎంపీటీసీ ముచ్చు వీర వెంకట సత్యనారాయణ(చిన్ని), దాకారపు సత్యనారాయణ, సీతంశెట్టి సీతారామవెంకటేశ్వరరెడ్డి, పండా పోతురాజు, పండు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత లేకుంటే నిలదీయండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ప్రభుత్వం మంజూరు చేసిన సిసి రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే ప్రజలు నిలదీయాలని రాజవొమ్మంగి సర్పంచ్ గొల్లపూడి రమణి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి రాజవొమ్మంగి పంచాయతీలో గుర్తించిన పనులకు జిజిఎంపి నిధులు సుమారు రూ.85 లక్షలు మంజూరు చేయగా, 14 సిసి రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి రాజవొమ్మంగి పంచాయతీ ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగిందని ఆమె తెలిపారు. గ్రామస్తులు తమ పరిధిలో వేసే సిసి రోడ్లు, కాల్వర్టు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించేలా చూసుకోవాలని సూచించారు.

19న పిఎన్‌ఎం మండల మహాసభ

ప్రజాశక్తి-విఆర్.పురం : ప్రజా నాట్యమండలి (పిఎన్ఎం) మండల మహాసభ ఈ నెల 19న రేఖపల్లి సిపిఎం కార్యాలయంలో జరుగుతుందని సంఘం సీనియర్ నాయకులూ సిహెచ్ సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసభ సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, పిఎన్ఎం మండల కమిటీ సభ్యులు, ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. మండల మహాసభకు పిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని సుబ్బారావు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకుంటామని టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు నక్కా లక్ష్మణరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటికి 1055వ రోజుకు చేరాయి.

దీక్షల్లో టిఎన్‌టియుసి నాయకులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవడంలో అందరికంటే ఎక్కువ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంటుందన్నారు. దీక్షల్లో కుప్పిలి రామకృష్ణ, ఎంఎస్.కృష్ణ, పివి.రమణ, ఎస్.చిన్న అప్పారావు, పొక్కల కృష్ణ, కేసుబోయిన అప్పలరాజు, పెద్దాడ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.